విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

భగత్‌సింగ్ ఆశయసాధనకు పునరంకితం కావాలి

విశాలాంధ్ర -భీమవరం: దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యాగం చేసి ఉరికంబమెక్కిన సర్దార్ భగత్ సింగ్ ఆశయసాధనకు పునరంకితం కావాలని సిపిఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సర్దార్ భగత్ సింగ్ 116వ జయంతిని గురువారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సిపిఐ శ్రేణులు ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ బ్రిటిష్ దాస్యశృంఖలాల నుండి జాతి విముక్తి కోసం స్వాతంత్ర ఉద్యమంలో వీరోచిత పోరాటం చేసిన దేశభక్తుడు, భరతమాత ముద్దు బిడ్డ భగత్ సింగ్ అని కొనియాడారు. భగత్ సింగ్ బ్రిటిష్ మూకలపై వేసిన బాంబుల దాడి ఘటనలో పట్టుబడి ఉరి శిక్ష పడినా క్షమా భిక్ష కోరకుండా సంతోషంగా ఉరికంబమెక్కిన ధైర్యశాలని కోనాల గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, భీమవరం రూరల్ కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, నాయకులు వై.వి.ఆనంద్, పాలా త్రిమూర్తులు, ఛాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో : భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మండల కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ 116 వ జయంతి సందర్భంగా స్థానిక 39 వ డివిజన్ భగత్ సింగ్ సెంటర్లో భగత్ సింగ్ .యంది సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహానికి సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వర రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, సిపిఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు, పూలదండ లేసి భగత్ సింగ్ కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడి భారతదేశానికి స్వాతంత్రం రావడంలో ప్రముఖ పాత్ర వహించిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య కుల, మత, వివిధ వర్గాల మధ్య విద్వేషాలు రగిలించి లౌకిక వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నదని అన్నారు. భగత్ సింగ్ ఆశయాలు కొనసాగాలంటే కేంద్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చింతలపూడిలో : భగత్ సింగ్ స్ఫూర్తితో అంతరాలు, అసమానతలు లేని సమాజం,

సంపదలో వాటా, సమగ్ర యువజన అభివృద్ధి, నూతన ప్రత్యామ్నాయ రాజకీయ విలువల కోసం నిలబడదామని అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు అన్నారు. భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో వారి కుటుంబం అప్పటికే పోరాడుతున్న పరిస్థితుల్లో వారి ఉనికిని అంది పుచ్చుకొని అతి చిన్న వయసులోనే స్వతంత్ర పోరాటంలో దేశంలో యువతను ఆకర్షించి పోరాట మార్గాన్ని ఎంచుకున్న వ్యక్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వీరు చేసే నిరసన ముందే తెలిపి దానిని అమలు జరపడంలో సఫలీకృతులయ్యారన్నారు. అతి చిన్న వయసులో ఉరికంబమెక్కిన వ్యక్తి సర్దార్ భగత్ సింగ్ అన్నారు ఈ కార్యక్రమంలో అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ మాజీ నాయకులు కంచర్ల గురవయ్య, తొర్లపాటి బాబు, గట్టు వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు బొల్లవరపు విజయ శేఖర్, బత్తుల రఘు, బొంతు నవీన్, తదితరులు నివాళులర్పించారు.

కామవరపుకోటలో : సర్దార్ భగత్ సింగ్ గొప్ప పోరాట యోధుడిని సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు అన్నారు. గురువారం విప్లవ యోధుడు సర్దార్ భగత్ సింగ్ 116వ జయంతి సిపిఐ కార్యాలయంలో జరిగింది. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం అతి చిన్న వయసులోనే భగత్ సింగ్ తాత తండ్రుల స్ఫూర్తితో స్వాతంత్ర పోరాటంలో పాల్గొని నాడు పార్లమెంట్లో భారతీయులకు వ్యతిరేకంగా పార్లమెంటులో రాజ్‌గురు, సుఖదేవులతో కలిసి భారతదేశ వ్యతిరేక విధానాలను ఖండిస్తూ పార్లమెంటులో ఒక బాంబు విసిరి నిరసన తెలియజేసిన మహాయోధుడు సర్దార్ భగత్ సింగ్ అని కొనియాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని అమలు చేయకుండా

అడ్డు తగులుతున్న నేటి కాషాయ పాలకులను రాబోయే కాలంలో తరిమికొట్టాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నీలం శ్రీనివాసరావు, టి. సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్నేని మరణం రైతులోకానికి తీరనిలోటు

విశాలాంధ్ర-ముదినేపల్లి : రైతు బాంధవుడు ఎర్నేని నాగేంద్రనాథ్ మరణం రైతు లోకానికి తీరనిలోటని టిడిపి తెలుగు రైతు విభాగ రాష్ట్ర ఉపాధ్య క్షులు చలసాని జగన్మోహనరావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు పేర్కొ న్నారు. రాష్ట్ర డ్రైనేజీ బోర్డ్ మాజీ సభ్యులుగా, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులుగా రైతులకు ఎనలేని సేవలందించారన్నారు. ముదినేపల్లి మండలం లోని టిడిపి శ్రేణులతో, రైతులతో ఆయనకున్న సన్నిహితబంధాన్ని గుర్తుచేసుకుంటూ విచారాన్ని వ్యక్తం చేశారు. సాగు నీటి ప్రాజెక్టుల్లో, నీటి యాజమాన్యం, ప్రధాన కాలువలు, డ్రైనేజీల సామర్థ్యం, రైతులకు సాగునీటి ఎద్దడి పరిస్థితులలో వారి సమస్యలు ప్రభుత్వ దృష్టికి తెచ్చి నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. మండలంలోని టిడిపి నాయకులు బొప్పన సుందర రామయ్య, బండి సత్యనారా యణ, వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షులు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, కొత్తూరి విఠల్, రైతులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

ఘనంగా భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతి

విశాలాంధ్ర-టీ నరసాపురం: టి నరసాపురం విజన్ యుపి స్కూల్ లో భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతి వేడుకలు అరసం, ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అ ర సం రాష్ట్ర కార్యదర్శి బి ఎస్ సాగర్ మాట్లాడుతూ ఒకపక్క కార్పొరేట్ శక్తులు, మరోపక్క మతోన్మాద ఫాసిస్టు మూకల దాడుల నుంచి దేశాన్ని రక్షించడానికి భగత్ సింగ్ చేసిన త్యాగాలను పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కలాన్ని ఆయుధంగా మలచుకొని కుల వివక్ష పై తన కవితాస్త్రాలను సంధించిన మహా వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. ఈ కార్యక్రమంలో జి. విజయలక్ష్మి, కె. మహా లక్ష్మి,టి. అరుణ, జి. వరలక్ష్మి, కె. ఎస్తేరు రాణి, బి. పుష్పావతి, కె రాజేశ్వరి,జి. రమ్యశ్రీ, వి. మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు సిఐగా బాల సురేష్

విశాలాంధ్ర- నూజివీడు : నూజివీడు రూరల్ సిఐ గా బాల సురేష్ బాధ్యతలు స్వీకరించారు .ఇప్పటి వరకు ఇక్కడ సిఐ గా వున్న అంకబాబు విఆర్ కు బదిలీకాగా ఆయన స్థానంలో బాల సురేష్ నియమితులయ్యారు. ఇంతకు ముందు బాల సురేష్ జంగారెడ్డిగూడెం సిఐగా పనిచేసారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

విశాలాంధ్ర -ముదినేపల్లి : జగనన్న ఆరోగ్య సురక్షపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద డిఆర్డిఏ పిడి ఆర్ విజయరాజు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.మల్లేశ్వరి, తహసీల్దార్ కె. శ్రీనివాస్, ఈవోపిఆర్డి డి.లక్ష్మీనారాయణ, డిఆర్‌డిఏ ఎపిఓ బి.సత్యనారాయణ, ముదినేపల్లి, గురజ, దేవపూడి పిహెచ్సి వైద్యులు శాంతిశ్రీ, తరణి, మధుసూదనరావు, వినయ్ కుమార్, వైద్య సిబ్బందితో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రక్రియ వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం రెవిన్యూ కార్యాలయంలో ఏలూరు జిల్లా కలెక్టర్ వీసీ సమీక్షలో అధికారులతో కలిసి పిడి విజయరాజు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి వ్యవసాయరంగానికి తీరని లోటు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్మెస్ స్వామినాథన్ మృతి వ్యవసార రంగానికి తీరని లోటు అని ప్రకాశం డిగ్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్ వి. జనార్దన్‌రావు పేర్కొన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ చెన్నైలో మృతి చెందారని తెలుసు కొని కళాశాల వద్ద స్వామినాథన్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో స్వామినాథన్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జనార్దన్‌రావు మాట్లాడుతూ వ్యవ సాయంపై అనేక పరిశోధనలు చేసి, దేశవ్యాప్తంగా కాకుండా ప్రపంచవ్యాప్తంగా, ఎన్నో సేవలు అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ స్వామినాథన్ అని కొనియాడారు. ఆయనపై ఉన్న ప్రేమతో తమ కళాశాలకు స్వామినాథన్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల అని పేరు కూడా పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతాప్ కృషి ప్రశంసనీయం

విశాలాంధ్ర-చాట్రాయి: నూజివీడుకు కేంద్రీయ విశ్వవిద్యాలయం మంజూరు చేయించడంలో శాసన సభ్యులు ప్రతాప్ కృషి ప్రశంసనీయ మైనదని సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఇవి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కొనియాడారు. విద్యాభివృద్ధి కోసం ప్రతాప్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వచ్చిన ప్రతి అవకాశాన్ని పట్టు వదలకుండా పని చేస్తున్నారని ప్రశంసించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతాప్ వ్యక్తిగత పని విధానాన్ని అభినందించారు. గడపగడపకు వెళ్లిన సందర్భంగా కూడా సాయంత్రం గం.5.30 నుంచి రాత్రి గం. 10.30వరకూ కాలి నడకన తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి అత్యంత ప్రాధాన్యతని ఇచ్చారని గుర్తు చేశారు.

చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనలు

విశాలాంధ్ర - లింగపాలెం : చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా చింతలపూడి నియోజకవర్గంలోని తెదేపా నాయకులు గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ దళిత విభాగపు తెదేపా నాయకులు బోడా అనీష్, మారుమూడి తామస్ లు రాజమండ్రిలో ఉన్న భువనేశ్వరిని కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈమెకు అంబేద్కర్ చిత్ర పటాన్ని బహుకరించారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు తాము పోరాటం చేస్తున్నామని న్యాయం జరిగే వరకు తమపోరాటం కొనసాగుతోందని భువనేశ్వరి కి తెలిపారు. లింగపాలెంలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు అరెస్ట్ కు నిరసనగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ అరెస్ట్ నిరసిస్తూ మద్దతు తెలిపే వారందరూ తమ సంఘీభావాన్ని తెలపాలని ఫోన్ నెంబరు ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో మొరంపూడి మల్లిఖార్జునరావు, యాళ్ల లీలా ప్రశాంతి, గరిమెల్ల చలపతి, పల్లి శ్రీను, అసిలేటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: స.హ.చట్టాన్ని సద్వినియోగం చేసుకుని పౌర సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. అంతర్జాతీయ సమాచార హక్కుల దినోత్సవాన్ని శ్రీవిజ్ఞాన వేదిక గురువారం భీమవరంలో నిర్వహించింది. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లా డుతూ దేశంలో అమల్లో ఉన్న స.హ.చట్టం-2005 ఎంతో శక్తివంతమైందని ఇది వజ్రాయుధమని దీనితో అవినీతిని కూకటివేళ్లతో పెకిలించవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, గంటా సుందర కుమార్, ఉండవల్లి రమేష్ నాయుడు, ఛాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

ఎర్నేని మృతి రైతు ఉద్యమాలకు తీరని లోటు

విశాలాంధ్ర -భీమవరం: ఎర్నేని నాగేంద్రనాథ్ మృతి రైతు ఉద్యమాలకు తీరని లోటని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి కార్యదర్శి లంక కృష్ణమూర్తి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడుగా రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన నాగేంద్రనాద్ రైతాంగ సమస్యల పరిష్కారానికి అవిరళ కృషి చేశారని కొనియాడారు. నిత్యం రైతు సమస్యల పరిష్కారానికి పని చేస్తూ ఉండేవారని తుది శ్వాస వరకు ఆయన రైతులతోనే ఉన్నారని లంక గుర్తుచేశారు. రైతు కార్యాచరణ సమితి జిల్లా కార్యవర్గ సభ్యులు దండు శ్రీనివాసరాజు తదితరులు ఎర్నేని మృతికి నివాళులర్పించారు.

రత్నకుమారి ఘటన దారుణం

విశాలాంధ్ర -భీమవరం: ముక్కుపచ్చలారని ములుకు రత్నకుమారి పై అత్యాచారం చేసి హత్య చేసిన ముష్కరుడిని అత్యంత కఠినంగా శిక్షించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక 7వ వార్డుకు చెందిన చిన్నారిని సమీప బంధువే బలితీసుకోవడం సభ్య సమాజాన్ని తలవంచుకునేలా చేసిందని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కేతవరం విద్యార్థిని

విశాలాంధ్ర-టీ నరసాపురం: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కేతవరం విద్యార్థిని కసగాని మౌనిక ఎంపి కైనట్లు ప్రధానోపాధ్యాయులు బి.కృష్ణ తెలిపారు. కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర పోటీలకు ఎంపికైన మౌనికకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన ఎస్ సి హెచ్. బి.ఆర్.ఎం ఉన్నత పాఠశాల భీమవరంలో నిర్వహించిన యోగా అండర్ 14 విభాగంలో కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కసగాని మౌనిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి. రమేష్, యోగా ఇన్ స్ట్రక్టర్ కె. వెంకటేశ్వరరావులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసురత్నం, జార్జ్, విజయ్ కుమార్, ఫణి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

'బాబుతో నేను' విస్తృత ప్రచారం

విశాలాంధ్ర- తణుకు : బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా గురువారం తణుకు పట్టణంలోని 6వ వార్డులో తెలుగుదేశం పార్టీ ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్బదాసరి లాజర్ ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంచారు.అనంతరం ఆయన వార్డులోని ప్రజలతో మాట్లాడారు. తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి జైలులో రిమాండ్ లో ఉంచడం అమానుష చర్య అని అన్నారు. ఆయన వెంట తెదేపా నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



పక్కా ప్రణాళికతో జగనన్న ఆరోగ్య సురక్ష

- **పొరపాట్లకు తావు లేకుండా కార్యక్రమం నిర్వహించాలి**
- **30న జిల్లాలో 25 గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష**
- **కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వెల్లడి**

విశాలాంధ్ర - ఏలూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 30వ తేదీన ప్రారంభమవుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వైద్య ఆరోగ్య సిబ్బందితో గురువారం ఏలూరు కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్షా నిర్వాహణ కోసం పక్కా ప్లానింగ్ తో సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రాసెస్ (ఎస్ వో ఎస్)ప్రకారం ఎవరెవరికి కేటాయించిన విధులను వారు పక్కాగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఇందుకు మ్యాన్ పవర్ ప్లానింగ్ తయారు చేసుకోవాలన్నారు. హెల్త్ స్క్రీనింగ్ కోసం ఐదు విభాగాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హెల్ప్ డిస్క్ రిజిస్ట్రేషన్ డాక్టర్ అలాట్మెంట్ కన్సల్టేషన్ రూమ్స్ ల్యాబ్ టెస్ట్ కంటి విభాగం స్కానింగ్ తదితర కౌంటర్లను తో పాటు ప్రత్యేకంగా ఆరోగ్యశ్రీ, న్యూట్రిషన్ స్టాల్ ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చిన వారికి సంతృప్తికరమైన సేవలు అందేలాగా చూడాలని అన్నారు. ప్రతి శిబిరంలో మూడు నాలుగు కంప్యూటర్లు , ప్రింటర్ లతో లతో సహా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అవసరమైన పారిశుద్ధ్య సిబ్బంది నియమించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డా.శర్మిష్ట, జడ్పీ సీఈఓ కె.రవికుమార్ ,కంటి విభాగం అధిపతి డాక్టర్ మల్లికార్జునరావు, అదనపు డిఎంహెచ్వో డా. రాజీవ్, డి ఐ ఓ డా. నాగేశ్వరరావు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

స్వామినాధన్ మృతి దేశానికి తీరని లోటు

విశాలాంధ్ర-భీమవరం: హరితవిప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ మృతికి సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్వామినాథన్ మృతి దేశ వ్యవసాయ రంగానికి, రైతు లోకానికి తీర్చలేనిదన్నారు.రైతుల ఆత్మహత్యలు నివారణకు వ్యవసాయం లాభసాటికి స్వామినాధన్ కమిషన్ సిఫారసులు ఎప్పటికీ ప్రామాణికంగా నిలిచేవుంటాయన్నారు.వ్యవసాయ రంగ అభివృద్ధికి,అధిక ఆహారోత్పత్తికి స్వామి నాధన్ ఎనలేని కృషి చేశారన్నారు.దేశం గర్వించదగ్గ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామి నాధన్ జీవితం అందరికీ స్ఫూర్తి దాయకమని పేర్కొంటూ భీమారావు నివాళులర్పించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని పోలవరం శాసన సభ్యుడు తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని అల్లంచర్ల రాజు పాలెం, కొత్త గూడెం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శకంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధి దారునికి అందజేస్తున్నామన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు సామంత పూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపిపి డి. లక్ష్మి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీను రాజు,ఎంపిటిసి బొడ్డపాటి రాంబాబు, వాసిరెడ్డి మధు, బోళ్ళా రంగారావు, ములకయ్య, కె. సత్తిపండు, బొల్లారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఏ గ్రంధి శ్రీనివాస్‌ను కలిసిన రూరల్ సీఐ

విశాలాంధ్ర-భీమవరం: భీమవరం రూరల్ సిఐగా బదిలీ పై వచ్చిన బి. సత్య కిషోర్ గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ విధినిర్వహణలో ప్రజల మన్ననలను పొందాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బండి వెంకటేశ్వరరావును ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈనెల 25, 26, 27 తేదీలలో బాపట్లలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభలలో బికేఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బండి వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. ఆయన 1979లో అఖిల భారత విద్యార్థి సమాఖ్యలో చేరి విద్యార్థి సంఘంలో పట్టణ స్థాయి నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేసిన బండి వెంకటేశ్వరరావు 1992 తర్వాత అఖిల భారత యువజన సమాఖ్య ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పని చేశారు. 1998 నుండి సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శిగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2006 నుండి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుత సంవత్సరం జూలైలో జరిగిన ఏలూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రథమ మహాసభలో ఏలూరు జిల్లా అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఏలూరు జిల్లా నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కుంచే వసంతరావు, రాష్ట్ర సమితి సభ్యులుగా బత్తుల వెంకటేశ్వరరావు, గొలిమే బాల యేసు, కూరాకుల బాబురావు, ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోనేరు రంగారావు భూ కమిషన్ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో చేర్చి రాష్ట్రంలో భూమిలేని దళితులకు ఇతర పేదలకు మిగులు భూములు, అటవీ బంజరులు పంచాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర మహాసభల స్ఫూర్తితో రానున్న రోజులలో ఏలూరు జిల్లాలో భూ సమస్యల మీద ఎస్ సి, ఎస్ టి ఇతర వెనుకబడిన వర్గాలు, ముస్లిం మైనారిటీల సమస్యలపై ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందని బండి వెంకటేశ్వరావు తెలిపారు. రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇవ్వాలని లేనిపక్షంలో ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఉచితంగా ఇవ్వాలని మహాసభ తీర్మానించిందని తెలిపారు.

జమ్ము తోటలో మృతదేహం

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : భీమవరం వన్ టౌన్ పరిధి లెప్రసీ కాలనీలో ఓ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికులు తెలుపుతున్న వివరాల ప్రకారం లెప్రసీ కాలనీకి చెందిన ములుకు రత్నకుమారి (14) భీమవరంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు అంజిబాబు, అరుణ కూలి పనులు చేసుకుని జీవిస్తూ ఉంటారు. మంగళవారం యధావిధిగా తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లి సాయంత్రం 6 గంటలకు తిరిగి వచ్చేసరికి ఇంటి డోర్లు తెరిచి ఉండటం, అందులో కుమార్తె లేకపోవడంతో చుట్టుపక్కల వెతకగా జాడ లేకపోవడంతో మంగళవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో తమ కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. మరుసటి రోజుకి కూడా తిరిగి రాకపోవడంతో ఒకింత ఆందోళన చెందారు. గురువారం ఉదయాన్నే ఇంటి వెనుక ఉన్న జమ్ము తోటలో నిర్జీవంగా పడి ఉన్న తన కుమార్తెను చూసిన తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. ఇదే విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ పి యు రవి ప్రకాష్, డి.ఎస్.పి శ్రీనాథ్ లు సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ కేసు నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు చేస్తామని తెలిపారు.

చిన్నానే హంతకుడు... వరుసకు చిన్నాన్న అయిన ములుగు శివ హత్య చేసి ఉంటాడని మృతురాలి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాము ఇంటి దగ్గర లేని సమయంలో మంగళవారం ఉదయాన్నే తమ కుమార్తె సెల్ఫోన్ రీఛార్జ్ నిమిత్తం వెళుతుండగా నేను రీచార్జ్ చేస్తానని నమ్మబలికి ఇంటిలోనికి తీసుకు వెళ్లి అత్యాచారం చేసి, అనంతరం హత్య చేసి ఇంటి వెనక ఉన్న జమ్ము తోటలో పడవేసి ఉంటాడని ఆరోపిస్తున్నారు.

గుర్రం జాషువా కవితలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-భీమవరం: గుర్రం జాషువా కవితలు స్ఫూర్తిదాయకమని, వారి స్ఫూర్తితో ఉన్నత చదువులు చదివి మంచి స్థానాలను చేరుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. గురువారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి కె. కృష్ణవేణి పాల్గొన్నారు. తొలుత గుర్రం జాషువా చిత్రపటానికి డిఆర్ఓ కె.కృష్ణవేణి, భీమవరం ఆర్డీవో దాసిరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ కే కృష్ణవేణి మాట్లాడుతూ ఆనాడు అస్పృశ్యత, అంటరానితనం రూపుమాపడానికి తన వంతు కృషిగా గుర్రం జాషువా కవితలతో చైతన్యపరిచారన్నారు. గుర్రం జాషువా కవితా పటుత్వాన్ని మెచ్చి ఆనాటి తిరుపతి వెంకట కవులు సైతం గుర్రం జాషువాకు గండ పెండేరాన్ని తొడిగి సన్మానించడం అంటే, పట్టుదలతో ఎంత మహోన్నత వ్యక్తిగా ఎదిగారో చెప్పనవసరం లేదన్నారు. కవులు తెన్నేటి లక్ష్మి నరసింహా మూర్తి, కోలాటి పెద్దిరాజు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సత్య సుధామా, చవాకుల భరత్, వివిధ సంఘాల ప్రతినిధులు పొన్నమండ బాలకృష్ణ, కటికతల రాజారావు, పెద్దిరాజు, పి.ముసలయ్య, విద్యార్థిని కుమారి సుషిత గుర్రం జాషువా గురించి మాట్లాడుతూ తల్లిదండ్రులు వేరువేరు కులాలకు చెందిన వారనీ, తండ్రి యాదవ, తల్లి మాదిగ కావడంతో ఆనాడు మూఢాచారాలతో నిండిన సమాజంలో ఎన్నో అవ మానాలు, ఛీత్కారాలు ఎదుర్కొన్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్ప రాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జి వి ఆర్ కె ఎస్ ఎస్ గణపతి రావు, డీఎస్ఓ ఎన్ సరోజ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాస రావు, జిల్లా ఆర్ అండ్ బి అధికారి ఎస్.లోకేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కె. మురళీకృష్ణ, హౌసింగ్ ఈఈ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విడుదల చేయాలని కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర-టీ నరసాపురం: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ తిరుమల దేవిపేట గ్రామంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో పుర వీధుల్లో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును రాజకీయ కక్షతోనే అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసిన కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటికి వస్తారని ఆయన తెలిపారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తోట నాయుడు, పండు, వడ్డే శ్రీను, ఎం.దుర్గారావు, ఎం.సురేష్, టి. శ్రీను,సిహెచ్ వీర బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-భీమడోలు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఏలూరు ఆర్డీవో ఖాజావలి అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కార్యక్రమంపై భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏలూరు ఆర్డీవో ఖాజావలి మండల వైద్యాధికారులు, రెవెన్యూ, సచివాలయాలు, పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో ఖాజావలి కార్యక్రమం నిర్వహణపై అధికారులు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహసీల్దార్ ఇందిరాగాంధీ, ఎంపీడీవో సిహెచ్ పద్మావతిదేవి, డిప్యూటీ తహసీల్దార్ షంషుద్దీన్, వైద్యాధికారులు డాక్టర్ లీలాప్రసాద్,డాక్టర్ లక్ష్మీ,డాక్టర్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపాలెం సొసైటీ లాభం రూ. 37 లక్షలు

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : నవాబు పాలెం సొసైటీ ఆదాయం ఈ సంవత్సరంలో 37 లక్షల 64వేలు వచ్చిందని సొసైటీ చైర్ పర్సన్ జద్దు హరిబాబు తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలోని సొసైటీ బ్యాంకు ఆవరణలో సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ లావాదేవీలు ఖర్చులను సొసైటీ కార్యదర్శి పి.సత్యనారాయణ వివరించారు. సొసైటీ ఆదాయంలో సభ్యులకు ఎనిమిది శాతం డివిడెంట్ అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ హరిబాబు మాట్లాడుతూ సొసైటీ బ్యాంక్ ద్వారా రైతులకు అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు, ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం రైతులకు రుణాల అందించి వారు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మద్దుకూరి ప్రసాద్, చిట్టూరి బాపన్న, రైతులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కలిదిండి: రవాణా రంగంలో పనిచేస్తున్న లక్షలాదిమంది కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి. ఎన్ వి డి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురు వారం కలిదిండిలో రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం వారి సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న జీపు యాత్ర ప్రచార యాత్ర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగం ద్వారా లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని సంపాదిస్తూ దానికి ప్రధాన కారణమైన రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు ఇతర కార్మికుల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు క్లీనర్లు చిన్న యజమానులు రవాణా రంగం మీద ఆధారపడ్డ ప్రతి కార్మికుడు చలో రాజభవన్ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జె. గోపి సిఐటియు నాయకులు జక్కుల. మహేష్, శ్రీకాంత్, ప్రకాష్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు జి. రవీంద్ర, బి. శ్రీనివాసరావు, దాసు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో టిడిపి భిక్షాటన

విశాలాంధ్ర -భీమవరం: చంద్రబాబుపై అక్రమ కేసులకు వ్యతిరేకంగా భీమవరంలో గురు వారం టిడిపి శ్రేణులు రిలే నిరాహారదీక్షలు చేపట్టి బిక్షాటన నిర్వహించి నిరసన తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో రేవు వెంకన్న, వీరవల్లి శ్రీనివాస్, గూడూరి సుబ్బారావు, మోహన్, వీరమల్లు సూరిబాబు, కొయ్యలగడ్డ గణపతి, కొల్లాటి గోవింద్, కొల్లాటి నరసింహస్వామి, జల్లా వెంకటేశ్వరరావు, నసీమాబేగం, ఎండి.షబీనా, గంధం రాధ, మాదాసు కనకదుర్గ, నేదునూరి గంగాధర్, నల్లం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

16వ రోజుకు చేరిన టీడీపీ దీక్షలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబును అక్రమ అరెస్టుకు నిరసనగా పార్టీ పిలుపు మేరకు పోలవరం నియోజకవర్గ స్థాయిలో కొయ్యలగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న సామూహిక నిరాహార దీక్షలో నియోజకవర్గంలో ఉన్న 7 మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, దీక్షలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు దీక్షా శిబిరం వద్దకు చేరుకొని సంఘీభావం తెలియజేశారు. చంద్రబాబుతో నేను సైతం అంటూ దీక్ష శిబిరం వద్ద ఏర్పాటుచేసిన సంతకాల సేకరణ ఫ్లెక్సీ పై పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణారావు ప్రత్యేక సంతకాలు చేశారు. రామకృష్ణారావు మాట్లాడుతూ త్వరలోనే చంద్రబాబు కడిగిన ముత్యంలో జైలు నుండి విడుదల అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, జీలుగుమిల్లి మండల నాయకులు, కొయ్యలగూడెం మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక

విశాలాంధ్ర - గణపవరం: నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీలలో గణపవరం బాయ్స్ హై స్కూల్ విద్యార్థులు అండర్ 17 విభాగంలో వాలీబాల్‌కు ప్రణయ్ కుమార్, జాషువా ఎంపికయ్యాడు. అండర్ 17 విభాగంలో నవీన్ చెస్‌కి ఎంపికయ్యాడు. అండర్ 14 విభాగంలో చెస్‌కి మహేష్ కుమార్, పోసి సాయిరాం ఎంపికయ్యారు. వీరందరూ జిల్లా స్థాయికి వెళతారని హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం. పద్మావతి తెలిపారు.

ఎలుకల నిర్మూలనతో పంటల్లో అధిక దిగుబడులు

విశాలాంధ్ర-మండవల్లి: పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే ఎలుకల నిర్మూలన సకాలంలో సామూహికంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడిఎ.జి.వెంకటమణి అన్నారు.ఎలుకల నిర్మూలనపై మండవల్లి ఆర్బికె నందు రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ఏడిఎ మాట్లాడుతూ ఆర్బికెల ద్వారా బ్రోమెడయోలిన్ మందును ఉచితంగా అందిస్తున్నామని మండవల్లి మండలానికి 25 కేజీల మందును ప్రభుత్వం సరఫరా చేసిందని మండలంలోని అన్ని ఆర్బికెల ద్వారా మందును రైతులకు అందిస్తామన్నారు. విషపు ఎర తయారికి 96 శాతం బియ్యపు నూకలు, రెండు శాతం నూనె, రెండు శాతం మందు అవసరమని మిశ్రమాన్ని తయారి చేసి పొట్లాలుగా చుట్టి ఎలుకల బొరియల్లో ఉంచి ఎలుకలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మెండా సురేష్, విఏఎలు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,రైతాంగం పాల్గొన్నారు.

జి పి.ఎస్ బిల్లుపై నిరసన

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జీపీఎస్ బిల్లుకు వ్యతిరేకంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిపిఎస్ బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి సిపిఎస్ ఉద్యమ నాయకుడు ఆర్. నాగ దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చిన మాట మర్చిపోయి నేడు దుర్మార్గంగా జీపీఎస్ బిల్లు తీసుకువచ్చారన్నారు. ఉద్యోగులకు నష్టం చేకూర్చే విధంగా ఉన్న జీపీఎస్ విధానం వల్ల ప్రభుత్వానికే ఉపయోగం కానీ ఉద్యోగికి ఉపయోగం లేదన్నారు.బి.టి.ఏ మండల కార్యదర్శి కె.రాజా మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన కోరిక అయిన పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఏపిటిఎఫ్ నాయకులు కే. సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగికి వృద్ధాప్యంలో అండగా నిలవాల్సిన ప్రభుత్వం వాళ్ళ నోట్లో మట్టి కొట్టి వాళ్ళ దగ్గర డబ్బులు లాక్కొని వాళ్ళకే తిరిగి పెన్షన్ ఇస్తామని చెప్పడం దారుణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కే. రాజు ,వై.రాంబాబు, రామారావు, ధర్మరాజు, రమేష్, ఎన్. వీరభద్రరావు, సత్యనారాయణ,హరినాథ్, ఆచారి, పోశారావు, మోహన రాణి, అనూష,ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర- పోడూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాత్రాపు సూర్యనారాయణ కోరారు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి రైతాంగ శిక్షణా తరగతులు మండలం లోని కవిటంలో మేడపాటి పరశురామారెడ్డి కళ్యాణ మండపంలో గురువారం ప్రారంభమయ్యాయి. శిక్షణా తరగతులలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని గతంలో ఎన్నడూ లేనట్లుగా వర్షాభావంతో అధిక మండలాలు కరువు మండలాలుగా మారిపోయాయని అన్నారు. పంట ప్రారంభం లోనే పంట ఎండి పోయి రైతాంగం తీవ్రంగా నష్ట పోయారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. బ్యాంక్ రుణాలు రద్దు చేసి తదుపరి పంటకు రుణాలు ఇవ్వాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ ని అనుసరించి పంటకు మద్దతు ధరను అమలు జరపాలన్నారు. స్వామి నాథన్ రిపోర్టు ప్రకారం మద్దతు ధర అమలు జరపాలని డిమాండ్ చేశారు.రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడుతూ ఖరీఫ్ పంట చేతికి వస్తున్నదని ప్రభుత్వం గత రబీ సీజన్ లోని ఇబ్బందులను గమనించి ముందుగానే సంచులు,బరకాలు తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు.కౌలు రైతులకు రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు.కొబ్బరి రైతులకు ప్రభుత్వము మద్దతు ధర కల్పించి రైతులను నష్టాల నుండి ఆదుకోవాలని కోరారు. శిక్షణా తరగతుల కు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తుగ నరసింహ మూర్తి అధ్యక్షత వహించారు. చింతకాయల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక సి ఎస్ టి ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం గెస్ట్ లెక్చరర్ పోస్ట్ కు అర్హులైన వారి నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులతో పాస్ అయ్యి ఉండాలని దానికి అనుబంధంగా ఏపి సెట్ లేదా ఎంఫిల్,పీహెచ్ డి చేసి,బోధనానుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు.అక్టోబర్ 5 వతేదీ లోపు కళాశాల కార్యాలయంలో సంప్రదించి బయో డేటాలను సమర్పించాలని,ఇంటర్వ్యూ తేదీని ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ప్రసాద్ బాబు తెలిపారు.

న్యాయం కావాలంటూ నిరసన

విశాలాంధ్ర-ముసునూరు: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టునకు నిరసనగా గురువారం మండల కేంద్రమైన ముసు నూరు మండపం సెంటర్ వద్ద న్యాయదేవత న్యాయ పక్షాన వుండి మా చంద్రబాబు నాయుడికి న్యాయం జరిగేలా మచ్చలేని చంద్రుడు వలే బయటకు రావాలని కోరుతూ టీడీపీ నేతలు నిరసన తెలిపారు. టిడిపి నాయకులు గద్దే రఘుబాబు, లక్కపాము కాంతారావు,రాపర్ల ప్రతాప్,గద్దల మోహనరావు, పర్వ తనేని వెంకటేశ్వరరావు, సుగసాని వేణు, ఏనుగుధాటి నాగరాజు, రంగు వాసు,పల్లిపాము జీవరత్నం,చలమాల వెంకటేశ్వరరావు, రెడ్డి కృష్ణ,నక్కా యోహాన్, తదితరులు న్యాయదేవతను వేడుకున్నారు.

మానవతా విలువలకు ప్రాధాన్యతనిచ్చిన జాషువా

విశాలాంధ్ర-ఏలూరు: గురువారం స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయం ఏలూరులో కవికోకిల, పద్మ విభూషణ, కళా ప్రపూర్ణ గుర్రం జాషువా 128 వ జయంతి సభ బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సాయిరాజు భల్లం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, గాయకులు, పుర ప్రముఖులు పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలంకరణ చేయటమే కాకుండా, జాషువా తెలుగు భాష సాహిత్య రంగానికి చేసిన కృషి, సేవలను గురించి కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగావిచ్చేసిన జెడి, సోషల్ వెల్ఫేర్ శాఖ విజయ ప్రకాష్ మాట్లాడుతూ, లౌకిక విధానానికి మానవతా విలువలకు సాహిత్యంలో పెద్ద పీట వేశారన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డా.లంకా వెంకటేశ్వర్లు, రిజిస్ట్రార్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ సమకాలీగిన కవుల కన్నా, ఆయన ఏ విధంగా అగ్ర గణ్యుడో వివరించారు.

ఏవిఆర్ విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ సమాజంలో విప్లవాత్మక ఆలోచన విధానాన్ని తమ రచనల ద్వారాను సందర్భోచితంగానూ, వారి తెలుగు భాషను, తెలుగు సాహిత్యంను కొత్త పుంతల తొక్కించారన్నారు.మేతర అజయ్ బాబు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమం బహుజన టీచర్స్ అసోసియేషన్, కరుణోదయ మానసిక విభిన్న ప్రతిభావంతుల పాఠశాల, బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ, ఏ వి ఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : నవయుగ వైతాళికుడు, కుల వ్యతిరేకతను అణగద్రొక్కి సమాజంలో మార్పునకు నిరంతరం శ్రమించిన నవయుగ వైతాళికుడు, ప్రముఖ కవి గుర్రం జాషువ 128వ జయంతి గురువారం విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విశ్రాంతి ఉద్యోగుల జిల్లా జాయింట్ సెక్రటరీ కొత్తపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ అభ్యుదయ కవితాతత్వాన్ని జీర్ణించుకుని ఆనాటి సమకాలిన పరిస్థితులను అనుగుణంగా రచనలు చేసి సమాజంలో ఉన్న అగ్ర కుల అహంకారాన్ని అణగద్రొక్కేందుకు కృషి చేశారని కొనియాడారు. పేదరికం, కులమత బేధం ఆయనకు సహనాన్ని నేర్పాయని, ఎదురించే శక్తి దారిద్ర్యాన్ని నుంచి విముక్తి పొందారని ఆయన అనాడే సమాజంలో ధైర్యంగా కవితల రూపంలో రచనలు చేశారన్నారు. గబ్బిలం, క్రీస్తు చరిత్ర లాంటి రచనలు వ్రాసి ప్రజల్లో మార్పునకు కృషి చేశారన్నారు. నవయుగ కవి చక్రవర్తిగా, కవి కోకిల, విశ్వ కవి సామ్రాట్ లాంటి పలు బిరుదులు ఆయన పొందారని తెలిపారు. నేటి యువత వాటిని ఆదర్శంగా తీసుకుని సమాజ మార్పులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగ సంఘ సభ్యులు పత్తి వీరాస్వామి, కోటి వీరారావు, ముస్తఫా, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఊరేగింపు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : అన్నదేవరపేటలో లక్ష్మి గణపతి ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా గణపతిని ఊరేగించారు. ఈ సందర్భంగా బుట్ట బొమ్మలు, రాముడు , ఆంజినేయుడు రామాయణంలోని పలు వేషాలతో డీజే , తిన్ మార్ దప్పులు తో పిల్లలు , పెద్దలు ఉత్సాహంగా వినాయకుడు ఊరేగింపులో పాల్ గొన్నరు అనంతరం నిమజ్జనం జరిగింది. ఆదివారం నాడు అన్నసంతర్పణ ఏర్పాటు చేశామని కమిటీ వారు తెలిపారు. భక్తులు పాల్గొన వలసిందిగా కోరారు.

అందరూ బాగుండాలని వినాయకునికి పూజలు

విశాలాంధ్ర - జగ్గంపేట : వినాయకచవితిని జగ్గంపేట నియోజకవర్గంలో అన్న సంతర్పణలు జరుగు తున్నాయి. జగ్గంపేట లారీ యూనియన్ అసోసియేషన్ అధ్వర్యంలో భారీ అన్న సంతర్పణ చేశారు. జగ్గంపేట మండలం రామవరం వద్ద ఉన్న లారీ యూనియన్ కార్యాలయం వద్ద ప్రతి ఏడాదీ వినాయకచవితి వేడుకలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్నారు. అదే విధంగా ఈ ఏడాది ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురష్కరించుకుని సమారు 5 వేల మందికి అన్న సంతర్పణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు దవులూరి ఈశ్వరరావు మాట్లాడుతూ 1991 సంవత్సరంలో లారీ యునియన్ భవనం నిర్మించామన్నారు. అప్పటి నుంచి వినాయక చతుర్థి ను జరుపుకుంటూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారన్నారు. తమ యూనియన్ సభ్యులు అంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా మారిశెట్టి రాధ మాట్లాడుతూ గత 4 సంవత్సరాల నుంచి సుమారు 6 నుంచి 7 వేల మంది జనాభా వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి భారీగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ వర్మ, సుబ్బరాజు, జీపు రాంబాబు, చక్రధర్, వై గంగాధర్, శివ, మారిశెట్టి రామకృష్ణ, శ్రీనివాస్, తదితర సభ్యులు పాల్గొని అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ప్రారంభమైన కొత్తలంక వలిబాబా ఉరుసు మహోత్సవములు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : మమ్మిడివరం మండలంలోని కొత్తలంక హాజరత్ సయ్యద్ అహ్మద్ ఖాదర్ వలి బాబా ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలలో భాగంగా బుధవారం గంధం పూయుట, గురువారం దీపారాధన, శుక్రవారం జియారత్ మూడు రోజులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వలి బాబాను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు నుంచి అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చి దర్శించుకుంటారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ వారు తగిన ఏర్పాట్లు చేశారు.

గంగమ్మ ఒడికి తరలివెళ్లిన వినాయకుడు



విశాలాంధ్ర - రాజానగరం : వినాయక చవితి వేడుకల్ని పురస్కరించుకుని నియో జకవర్గ కేంద్రమైన రాజానగరం లో గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. రాజానగరంలోని వివిధ కూడళ్లల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో 11 రోజుల పాటు పూజలందుకున్న లంబోదరుని శోభాయాత్ర గురువారం మధ్యాహ్నం నుండే మొదలైంది. నిమజ్జన కార్యక్రమాల్లో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వరునికి ఘనంగా వీడ్కోలు పలికారు. చిన్నారులు,యువకులు రంగులు అద్దుకొని డీజే పాటలకు డాన్సులు వేశారు. ఈ సందర్భంగా స్థానిక నరేంద్రపురం కూడలి వద్ద శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుమారు18 అడుగుల భారీ వినాయక విగ్రహానికి మేళతాళాలు, డిజె సౌండ్స్ మధ్య కమిటీ సభ్యులు డాన్సులు చేస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం రాజమహేంద్రవరంలోని గోదావరిలో నిమజ్జనగావించారు. బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గణనాథున్ని ఊరేగించి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. ఆయా కమిటీ సభ్యులు డాన్సులు చేస్తూ ఉల్లాసంగా నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్నారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా కమిటీ సభ్యులు పలు జాగ్రత్తలు తీసుకుంటూ ఊరేగింపుల్లో పాల్గొన్నారు.

తాడిపర్రులో భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: వినాయక చవితి, గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలోని తాడిపర్రులో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. తాడిపర్రు కరికాలబత్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటుపల్లి శ్రీరామారావు, పీతా నాని, మోటుపల్లి ఆంజనేయులు, పీతా రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో ఎస్‌ఎంఎఫ్ జీ గృహశక్తి సంస్థ ప్రారంభం

విశాలాంధ్ర-ఏలూరు: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అందుబాటు ధరల (సరసమైన) గృహ ఋణ (హౌసింగ్ ఫైనాన్స్) కంపెనీలలో ఒకటైన ఎస్‌ఎంఎఫ్ జీ గృహశక్తి, ఏలూరులో తమ మొదటి శాఖతో ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది రాష్ట్రంలో సంస్థకు 9వ శాఖ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ఈ విస్తరణ, రాష్ట్ర మంతటా వీలైనంత ఎక్కువ మందికి సరసమైన ధరల్లో గృహాలను అందుబాటులోకి తీసుకురావాలనే సంస్థ యొక్క దృఢమైన లక్ష్యం ను ప్రదర్శిస్తుందని ఎస్‌ఎంఎఫ్ జీ గృహశక్తి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీపక్ పాట్కర్ చెప్పారు. గతంలో ఫుల్లర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీగా గుర్తింపు పొందిన ఎస్‌ఎంఎఫ్ జీ గృహశక్తి, తమ విస్తృతమైన అనుభవం, బలమైన పేరెంటేజ్, దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూషన్ మరియు బలమైన రిస్క్ మేనేజ్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ తో గృహ , గృహాభివృద్ధి , గృహ నిర్మాణం , గృహ విస్తరణ తో పాటుగా తనఖా రుణాలు మరియు మధ్య స్థాయి డెవలపర్‌లకు కొత్త లేదా పునఃవిక్రయం వాణిజ్య ఆస్తి, వాణిజ్య ప్లాట్లు మరియు నిర్మాణ ఫైనాన్స్ కోసం రుణాలు సహా విస్తృతమైన రుణాల పోర్ట్‌ఫోలియోను కలిగి వుందని తెలిపారు.

అక్టోబర్ 2 నుంచి జీ తెలుగు లో సీతే రాముడి కట్నం

విశాలాంధ్ర-రాజమండ్రి: అక్టోబర్ 2 వ తేదీ నుంచి జీ తెలుగు చానల్ లో సేతే రాముడి కట్నం అనే నూతన ధారావాహిక ప్రారంభించనున్నట్టు ఆ ఛానల్ ప్రతినిధి వెల్లడించారు. నిరాడంబరత, నిజాయితీగా జీవించే సీత అనే సాధారణ అమ్మాయి చుట్టూ ఈ సీరియల్ కథ తిరుగుతుందన్నారు. సీత ఫ్యాషన్ పై అభిరుచి కలిగి, మంచి నైపుణ్యంగ ల టైలర్ గా పనిచేస్తుందన్నారు. నిజాయితీపరుడైన రామ్ పోలీస్ కావాలని కలలు కంటూ తన తల్లి ఆదేశం మేరకు తమ కుటుంబపరమైన వ్యాపారాన్ని చూసుకుంటూ ఉంటాడన్నారు. మహాలక్ష్మి కి (రామ్ తల్లి) అందానికే ప్రాధాన్యతిస్తూ, అందమైన అమ్మాయిని ఇచ్చి కొడుక్కి పెళ్లి చేయాలని ఆశపడుతుందన్నారు. అందంగా లేని దేన్నైనా ద్వేషించే మహాలక్ష్మి తనకు ఎ నచ్చని సీతను కోడలుగా పొందుతుందన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 12:30 కు ప్రసారం కానుందన్నారు. సీరియల్లో సీతగా వైష్ణవి, రామ్ గా సమీర్ నటిస్తున్నారని, మహాలక్ష్మిగా మంజుల పరిటాల నటించగా, సీత తండ్రి శివకృష్ణ పాత్రలో ప్రముఖ నటుడు ఇంటూరి వాసు కనిపించనున్నారని,

సీతే రాముడి కట్నం సీరియల్ ప్రారంభంతో మిగతా సీరియల్స్ ప్రసార సమయాల్లో స్వల్ప మార్పులు ఉంటాయని చెప్పారు.

వైభవంగా శ్రీ వినాయకుని నిమజ్జనం

విశాలాంధ్ర - ఐ పోలవరం : శ్రీ గణపతి చవితి నవరాత్రులు పరిసమాప్తి సందర్భంగా ఐ.పోలవరం మండలంలో వినాయక నిమజ్జనం అట్టహాసంగా జరుగుతున్నాయి. మురమళ్ళ పుష్కర ఘాట్‌లో పవిత్ర వృద్ధ గౌతమి నదిలో నిమజ్జనం చేశారు. ఐలాండ్ పరిసర ప్రాంతాలు ఉండే కాకుండా కోనసీమ జిల్లా ప్రాంతాల నుండి మురమళ్ళ ప్రాంతంలోకీ నలుమూలం నుండి తీసుకువచ్చి ఎక్కడ పవిత్ర వృద్ధ గౌతమి నదిలో నిమజ్జనం చేశారు. మురమళ్ళ శ్రీ మాణిక్యమ్మ నగర్ నుండి వినాయక నిమజ్జనం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ మాణిక్యాంబ వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయకుల ఊరేగింపులతో మురమల 216 జాతీయ రహదారి స్తంభించిపోయింది. వినాయక చవితి నిమజ్జనం ఊరేగింపులతో మురమళ్ళ ప్రాంతం కళకళలాడింది.

పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ప్రపంచ రేబిస్ దినోత్సవ సందర్భంగా స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గంజిమల రామారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పెంచుకునే తమ పెంపుడు కుక్కలకు రెబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. పశువుల ఆసుపత్రి వద్ద ప్రతిరోజు వ్యాక్సిన్లు వేస్తారని నిర్లక్ష్యం చేయకుండా మూగజీవాల ఆరోగ్యం పట్ల కూడా కుక్కల పెంపకం దారులు, పశువుల పెంపకం దారులు శద్ధ చూపాలని ఆయన తెలిపారు. కుక్కలకు వ్యాక్సిన్ వేయాలన్న, పశువులకు వివిధ శస్త్ర చికిత్సలు చేయాలన్నా పశు వైద్య అధికారిని సంప్రదించాలని రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పూలపల్లి రవికుమార్, పశు వైద్య అధికారి బిఆర్ శ్రీనివాసన్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలి

విశాలాంధ్ర - పిఠాపురం టౌన్ : పట్టణంలోని స్థానిక 13వ వార్డు శ్రీపాద శ్రీవల్లభ సంస్థానం ఎదురుగా గల వీధిలోని "వివి గ్రాండ్" వద్ద ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని స్థానికులు, కౌన్సిలర్ తల్లిశెట్టి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానం ఎదురు వీధిలో వివి గ్రాండ్ అను పేరుతో రూములు అద్దెకిచ్చు బిల్డింగు ఉందని, సదరు బిల్డింగు వారు వారి బిల్డింగు అవసరార్థం కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ వేయించుకొనుటకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ట్రాన్స్ఫార్మర్ ఆ ప్రదేశంలో కాకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వేరే చోట ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సతీష్, కరణం వెంకటేష్, బాలెం కిరణ్, శ్రీను, ప్రసాద్, నల్లమిల్లి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

జాషువా కవితలు ఆదర్శప్రాయం

విశాలాంధ్ర - పెద్దాపురం : తెలుగు భాషా రచయిత, కవి గుర్రం జాషువా కవితలు అందరికి ఆదర్శప్రాయంగా నిలుస్తాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ జాషువా పండితుడుగా, సాహితీవేత్తగా ఆయన అందించిన సేవలు వెలకట్ట లేనివన్నారు. తొలుత జాషువా చిత్రపటానికి చైర్మన్ తులసి మంగ తాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్ కనకాల మహాలక్ష్మిలతో కలిసి దొరబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్య భాస్కర్, ఆరెళ్ళి వీర్రాఘవులు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, గుర్రాల యాకోబు, పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు. దావీదు, తలారీ ధరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాదున్నబి వేడుకలు

విశాలాంధ్ర - పెద్దాపురం : ముస్లిం సోదరులు ఎంతో ప్రాముఖ్యంగా నిర్వహించుకునే మిలాదున్నబీ మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు గురువారం పెద్దాపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కబడ్డీ వీధి-మసీద్ నుంచి పురవీధుల్లో ముస్లిం సోదరులు భారీ ప్రదర్శన నిర్వహించగా ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ కరీమ్ (కానీ) ముఖ్య అతిథిలుగా పాల్గొని ముస్లీం సోదరుల ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ప్రవక్త ఆశయాలకి అనుగుణంగా ఆయన బోధనానుసారం నడుచుకోవాలన్నారు. ముస్లిం సోదరులకు తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, దొరబాబు అన్నారు. తొలుత మసీద్ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో కబడ్డీ వీధి, మెయిన్ రోడ్డు, మున్సిపల్ సెంటర్ మీదుగా బారీ ప్రదర్శన నిర్వహించి మసీద్ వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.